సాక్షి తిరుపతి

బుధవారం । 16 । ఆగస్టు । 2023



సేవకు సత్కారం

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఉద్యోగులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి సత్కరించారు. - 8లో



అన్నదాతకు అత్యుత్తమ సేవ

ఎస్పీడీసీఎల్ తరఫున అన్నదాతలకు అత్యుత్తమ సేవలందిస్తున్నట్లు సీఎండీ సంతోష్‌రావు తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	26
చిత్తూరు	36	26
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	37	26

తిరుపతిలోని పోలీస్ పరేడ్ మైదానంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి



తిరుపతిలో జెండా వందనం సమర్పిస్తున్న టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష తదితరులు



త్రివర్ణం.. సగర్వం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలతో తిరునగరి పులకించింది.. ఉద్యమ యోధుల త్యాగాలను స్మరించుకుని ప్రజానీకం ప్రణమిల్లింది.. త్రివర్ణ శోభను తిలకించి జాతీయతాభావంతో పరవశించింది.. మహనీయుల అడుగుజాడల్లో పయనిస్తామని నినదించింది.. తిరుపతిలోని పోలీస్ పరేడ్ మైదానంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. అతిరథ మహారథుల సమక్షంలో నవరత్నాలను ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన ప్రగతి శకటాలను వీక్షించారు.. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను ఆస్వాదించారు.

- ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- తిరుపతిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అంబరాన్నంటిన సంబరాలు
- జాతీయ జెండాను ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం నారాయణాస్వామి
- మహనీయుల స్ఫూర్తితో ముందడుగు వేయాలని పిలుపు
- ఆకట్టుకున్న ప్రగతి శకటాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



తిరుపతి : 100 అడుగుల ఎత్తులో జాతీయ జెండా

తిరుపతి అర్బన్/తిరుపతి కల్చరల్ : ప్రజల మద్దతుతో రాష్ట్రంలో సుస్థిరపాలన సాగుతోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. మంగళవారం తిరుపతి నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో నారాయణస్వామి ముఖ్య అతిథిగా హాజరై జాతీయపతాక్కాని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో మహనీయల పోరాటాలను గుర్తుచేశారు. జిల్లా తొలి ఇన్‌చార్జి మంత్రిగా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జగన్ సర్కార్‌లో ఎస్సీ,ఎస్టీలకు రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పారు. గాంధీజీ, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్నారని వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వందశాతం నెరవేర్చారని తెలిపారు. నవరత్న పథకాలను కుల,మత,వర్గ లింగ వివక్షతకు తావులేకుండా అర్హులందరికీ అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం డిప్యూటీ సీఎం చేతుల మీదుగా పొదుపు సంఘాల సభ్యులకు రుణాలు పంపిణీ చేశారు. గ్రామీణాభివృద్ధి సంస్థకు సంబంధించి 6,463 సంఘాల్లోని 46,871 మందికి శ్రీనిధి, జగనన్న పాలవెల్లువ, ఉన్నతి, ఎంఎస్ఎంఈ స్కీమ్స్ ద్వారా బ్యాంక్ లింకేజీ రుణాల కింద రూ.318.70కోట్ల చెక్కు అందించారు. అలాగే పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా అర్బన్ ప్రాంతాలకు చెందిన 1,174 సంఘాల్లోని 10,566 మంది సభ్యులకు రూ.172.22 కోట్ల చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి మేయర్ శిరీష, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నైనారు శ్రీనివాసులు, జేసీ బాలాజీ, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరిత, డీఆర్‌ఓ కోదండరామిరెడ్డి, ఆర్డీఓ కనకనరసారెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శకటాలు



స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రదర్శించిన శకటాలు ఆకట్టుకున్నాయి. గృహ నిర్మాణ సంస్థ, ఫ్యామిలీ డాక్టర్ 104,108 అంబులెన్స్, విద్యాశాఖ, పౌరసరఫరాల సంస్థ, దేవదాయ శాఖ, తిరుపతి స్మార్ట్ సిటీ, 1962 పశు అంబులెన్స్, పోలీస్ శాఖ వారు తమ శకటాలను అద్భుతంగా తీర్చిదిద్దారు. అందులో విశేషంగా రూపొందించిన విద్యాశాఖ, తిరుపతి కార్పొరేషన్, దేవదాయశాఖ శకటాలు తొలిమూడు స్థానాల్లో నిలిచి బహుమతులను గెలుచుకున్నాయి.



గ్లోబల్ మ్యాప్‌లో ప్రత్యేక గుర్తింపు



పతాకావిష్కరణలో రాజరాజన్

సూళ్లూరుపేట: ఇస్రో ప్రయోగాల పరంపరతో గ్లోబల్ మ్యాప్‌లో భారత్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చామని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ తెలిపారు. మంగళవారం షార్‌లోని స్పేస్ సెంట్రల్ స్కూల్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజరాజన్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. సీఐఎస్ఎఫ్ కమాండెంట్ రేఖా నంబియార్ ఆధ్వర్యంలో భద్రతా దళాలు గౌరవ వందనం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఏడు నెలల వ్యవధిలో ఆరు ప్రయోగాలు చేసి 50 ఉపగ్రహాలను రోదసీలోకి ప్రవేశపెట్టామని వెల్లడించారు. సెప్టెంబర్ మొదటివారంలో సూర్యుడిపై పరిశోధనలకు ఆదిత్య ఎల్1 ఉపగ్రహ ప్రయోగం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డిప్యూటీ కమాండెంట్ ఆశిష్ కుమార్ కుందన్, గ్రూప్ మేనేజ్‌మెంట్ సిస్టం హెడ్ గ్రూప్ పి. గోపీకృష్ణ, షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



పతాకావిష్కరణలో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం



గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు



సూళ్లూరుపేట : జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు



పోలీసు జాగిలం విన్యాసం

అశ్వంపై ఎన్‌సీసీ క్యాడెట్ విన్యాసం

అలరించిన సాంస్కృతికం

సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. సేవ్ అవర్ సోల్ సంస్థ ఆధ్వర్యంలో చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య యోధులకు వందనాలంటూ అలరించారు. బాలభవన్ పిల్లల నృత్యం అబ్బురపరిచింది. పద్మావతి మహిళా కళాశాల విద్యార్థుల మూకీ స్కిట్ ఆకట్టుకుంది. అనుప్పల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల నృత్యం, పులిగుండ్రం జెడ్పీ హైస్కూల్, పులిచెర్ల స్కూల్ విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి.



విద్యార్థినుల కళా ప్రదర్శన

స్టాల్స్ ప్రదర్శన

జిల్లాలోని వివిధ శాఖల వారు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. చేతివృత్తుల ఉత్పత్తులు, కలంకారీ, కొయ్యబొమ్మలు, వస్త్రాలు, చిరుధాన్యాలు వంటి ప్రదర్శనలను డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి తిలకించారు.



నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు శకటం



పొదుపు మహిళలకు మెగా చెక్కు అందిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ, కలెక్టర్



తిరుపతి నగరపాలక సంస్థ శకటం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

న్యూస్‌రీల్

డీ ఫార్మసీలో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో రెండేళ్ల డీ ఫార్మసీ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ డీ ఫార్మసీలో 66సీట్లు ఉన్నాయని, ఏడాదికి రూ.4,700 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించిన విద్యార్థులకు ఫీజు మినహాయింపు ఇవ్వడమే కాకుండా ఏటా రూ.20 వేల స్కాలర్‌షిప్ లభిస్తుందని వెల్లడించారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ ఉత్తీర్ణులైన వారు, సీబీఎస్‌సీ, ఐసీఎస్‌సీ సిలబస్, రాష్ట్ర, కేంద్ర ఓపెన్ స్కూల్స్‌లో 12వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ కోర్సుకు అర్హులని వివరించారు. ఆసక్తి గలవారు పది, ఇంటర్ మార్కుల జాబితా, టీసీ, 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఈ నెల 19వ తేదీలోపు "ఏపీఎస్‌బీటీఈటీ.ఇన్/పీహెచ్ఏఆర్ఎంఏసీవై వెబ్‌సైట్ ద్వారా రూ.400 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 99667 61446, 99088 57585 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్విమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ బ్లాక్



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జేఈఓ సదాభార్గవి

తిరుపతి తుడా : తిరుపతి స్విమ్స్‌లో రూ.150 కోట్లు వెచ్చించి సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మించినట్లు టీటీడీ జేఈఓ, ఆస్పత్రి డైరెక్టర్ సదా భార్గవి తెలిపారు. మంగళవారం స్విమ్స్‌లో ఘనంగా స్వాతంత్ర్యదినోత్సవం నిర్వహించారు. పతాకావిష్కరణ అనంతరం ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో పాత భవనాల పునరుద్ధరణకు రూ.300 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. దేశంలోనే అత్యున్నతంగా స్విమ్స్‌ను తీర్చిదిద్దేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామన్నారు. వైద్యులు మరింత ఉన్నతంగా సేవలందించి సహకరించాలని సూచించారు. ఉద్యోగోన్నతులు పొందిన అధ్యాపకులకు త్వరలోనే ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నట్లు వివరించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శరణ్ వి సింగ్, అల్లాడి మోహన్, అపర్ణా బిట్ల, రామ్, మాధవి, సుధారాణి పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో ఎర్త్ క్లైమెట్ హబ్



హబ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ బార్ట్‌ఫిషర్, వీసీ భారతి

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని సావేరీ అతిథి గృహంలో మంగళవారం ప్లానెట్ ఎర్త్ క్లైమెట్ హబ్ ప్రారంభించారు. డాక్టర్ బార్ట్ ఫిషర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ జాతీయ సోలార్ మిషన్, వాటర్ మిషన్ వాతావరణ పరిరక్షణలో కీలకమన్నారు. దేశంలో తొలి క్లైమెట్ హబ్ ఇక్కడ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. వీసీ భారతి, రిజిస్ట్రార్ రజిని, ఎస్వీయూ మాజీ వీసీ ఆర్. రామమూర్తి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు శిలాతోరణం వరకు బారులు తీరారు. ఆదివారం అర్ధరాత్రి వరకు 74,617 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 32,752 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 5.67 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీవారి సేవలో ప్రముఖులు



మాజీ క్రికెటర్ వెంకటేష్ ప్రసాద్

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం మాజీ క్రికెటర్ వెంకటేష్ ప్రసాద్, తెలంగాణ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దర్శించుకున్నారు. పండితులు ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

వైభవం..అమావాస్య ఉత్సవం



పురవీధుల్లో స్వామి,అమ్మవార్ల ఊరేగింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య ఉత్సవం వైభవంగా జరిగింది. తొలుత ఆలయ అలంకార మండపంలో శ్రీగంగాదేవి, జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఉత్సవమూర్తులకు విశేష అభిషేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

విశ్వవ్యాప్తం.. హిందూ ధర్మప్రచారం

తిరుపతి సిటీ : హిందూ ధర్మప్రచారాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు పునరంకితం కావాలిన టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం వద్ద ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ అనంతరం భూమన మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో శ్రీవారి భక్తుల సేవలో తరిద్దామని కోరారు. మహనీయుల త్యాగాల ఫలితమే నేడు మనం స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నామని తెలిపారు. యోధుల బలిదానాలను మననం చేసుకుంటూ దేశంలో శాంతి, సౌభ్రాతృత్వాలను నెలకొల్పేందుకు కృషి చేయాలని సూచించారు. తిరుమలలో శ్రీమహావిష్ణువు స్వయంభువుగా వెలిశారని, శ్రీవారి భక్తులకు సేవలందించిడం టీటీడీ ఉద్యోగుల పుణ్యఫలమని వివరించారు. మత మార్పిడులకు అడ్డుకట్ట వేసేందుకే దళిత గోవిందం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల పిల్లలకు అండగా నిలిచేందుకు కల్యాణమస్తు ప్రారంభించామని తెలిపారు. అందులో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో 32వేలకు పైగా జంటలకు శ్రీవారి సమక్షంలో వివాహం జరిపించామని చెప్పారు. స్వామివారి వైభవాన్ని వివరించేందుకు శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ఏర్పాటు చేశామని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో వేద విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులతో అర్హులైన ఉద్యోగులందరికీ త్వరలో ఇంటి స్థలాలు అందించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఎస్వీ సంగీత కళాశాల విద్యార్థులు ఆలపించిన అన్నమయ్య, పురందరదాసు కీర్తనలు, నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలోనే విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన సుమారు 210మందికి పైగా ఉద్యోగులకు పతకాలు, పశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ ధర్మారెడ్డి, జేఈఓలు వీరబ్రహ్మం, సదాభార్గవి పాల్గొన్నారు.



మువ్వన్నెలకు వందన సమర్పణం

క్లుప్తంగా

మన ఊరు.. మన నేల



గ్రామస్తులతో కలిసి మొక్క నాటుతున్న మోహన్‌బాబు

చంద్రగిరి (తిరుపతి రూరల్): రంగంపేటలో మోహన్‌బాబు యూనివర్సిటీలో మంగళవారం ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవం నిర్వహించారు. మన ఊరు.. మన నేల విశిష్టతను చాటేలా సొంత ఊరు, కన్నతల్లిని మరచిపోకూడదనే నినాదంతో వినూత్నంగా వేడుకలు చేపట్టారు. అందులో భాగంగా మోహన్‌బాబు తమ స్వగ్రామం మోదుగులపాళెం నుంచి మట్టి, ఇసుక తెప్పించారు. ఇంటికొకరు చొప్పున గ్రామస్తులను పిలిపించారు. వారి చేతులమీదుగా వర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటించారు. మోహన్ బాబు మాట్లాడుతూ చిన్ననాటి మిత్రులతో మొక్కలు నాటించే వినూత్నంగా కార్యక్రమం చేపట్టామని తెలిపారు. దేశానికి రైతు, సైనికుడు ఎంత ముఖ్యమో ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వర్సిటీ సీఈఓ, సినీ నటుడు మంచు విష్ణువర్ధన్ బాబు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గేదెల మృతి



గేదెల కళేబరాలు

కేవీబీపురం: మండంలోని బ్రాహ్మణపల్లెలో మంగళవారం విద్యుదాఘాతంతో ఆరు గేదెలు మృతిచెందాయి. సుందరమ్మ, శ్రీనివాసయాదవ్, మధు, కాటయ్యకు చెందిన గేదెలు గ్రామానికి సమీపంలోని పొలాల్లో మేత మేస్తున్నండగా 11కేవీ విద్యుత్ తీగలు తెగిపడడంతో మరణించాయి. పాడితో జీవనం సాగిస్తున్నామని, ఉపాధి కోల్పోయామని బాధితులు తెలిపారు.

సేవకు సత్కారం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వతంత్ర సమరయోధుడు రామలింగరాజు కుమారుడు రాధాకృష్ణరాజును డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఘనంగా సత్కరించారు. అలాగే విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు, పతకాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ డీకే బాలాజీ, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. – తిరుపతి అర్బన్



కనకనరసారెడ్డి, ఆర్డీఓ, తిరుపతి | కోదండరామిరెడ్డి, డీఆర్‌ఓ | తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరిత | స్వాతంత్ర్య సమరయోధుడు రామలింగరాజు కుమారుడు రాధాకృష్ణరాజును సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం



భాస్కర్‌నాయుడు, ఎస్‌డీసీ | శ్రీనివాసులు ఎస్‌డీసీ | జయరాజ్, జిల్లా సర్వే అధికారి | రాజా రఘువీర్, డీఎస్‌ఓ | వై.సుమతి, సివిల్ సప్లయి మేనేజర్ | ప్రసాద్‌రావు డీపీఓ | రవికుమార్,పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి | సుభాష్, లీడ్ బ్యాంక్ మేనేజర్ | సతీష్,సూక్ష్మ సేద్య జిల్లా అధికారి | శ్రీనివాసులురెడ్డి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి | జయభారతి డీసీఓ | సతీష్, అటవీశాఖ జిల్లా అధికారి



డాక్టర్ శ్రీహరి, డీఎంహెచ్‌ఓ | రాజశేఖర్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా అధికారి | ప్రేమ్‌చంద్ సీపీఓ | రాజశేఖర్‌రెడ్డి డీపీఓ | జ్యోతి డీఆర్‌డీఏ పీడీ | శ్రీనివాసప్రసాద్ డ్వామా పీడీ | చెన్నయ్య, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి | మురళీకృష్ణారెడ్డి సీఈఓ, సెట్విన్ | శంకర్‌నారాయణ, పంచాయతీ రాజ్ అధికారి | విజయకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి | సుధాకర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారి | వెంకటేశ్వరరావు,జిల్లా గృహనిర్మాణాధికారి



కృష్ణారెడ్డి విద్యుత్‌శాఖ ఈఈ | సీతారామిరెడ్డి ఆర్టీఓ | ప్రతాప్‌రెడ్డి,జిల్లా పరిశ్రమల జీఎం | లక్ష్మీకర్‌రెడ్డి జిల్లా ట్రెజరర్ | బాలకొండయ్య, పౌరసంబంధాల అధికారి | విజయసింహారెడ్డి డీపీఆర్‌ఓ | రమణయ్య, అగ్నిమాపక అధికారి | లక్ష్మి తుడా సెక్రటరీ | శేఖర్ డీఈఓ | రమణప్రసాద్, టూరిజం అధికారి | జయరాం ఏఓ, కలెక్టరేట్ | సురేష్‌బాబు,జిల్లా ఎన్నికల అధికారి



చంద్రముని ఆర్డీఓ, సూళ్లూరుపేట | వెంకటరమణ తహసీల్దార్,తిరుపతి | సుబ్రమణ్యం,తహసీల్దార్, తిరుపతి రూరల్ | నాగరాజు వీఆర్‌ఓ | హరిబాబు,ఆర్టీసీ డీఎం, అలిపిరి డిపో | ప్రభావతి,డీఆర్‌డీఏ, అసిస్టెంట్ పీడీ | రామచంద్రారెడ్డి | వెంకటరమణ, మత్స్యశాఖ అధికారి | ఈశ్వరమ్మ,అసిస్టెంట్ డీపీఆర్‌ఓ | సుధీర్, పౌరసంబంధాలశాఖ | జ్ఞానేశ్వర్‌రెడ్డి, కార్పొరేషన్ ఉద్యోగి | మోహన్, తిరుపతి కార్పొరేషన్ ఎస్‌ఈ



రాధమ్మ మెప్మా పీడీ | విజయకుమార్‌రెడ్డి, ఈఈ పబ్లిక్ హెల్త్ | డాక్టర్ దేవి | లక్ష్మీనారాయణ, సెక్రటరీ,తిరుచానూరు | సైమన్ స్పోర్ట్స్ అధికారి | ఖాదర్‌వలీ, శిల్పారామం ఏఓ | విజయశంకర్‌రెడ్డి, సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ | డాక్టర్ సుధారాణి | డాక్టర్ శశిధర్‌రెడ్డి | చెంగల్రాయిల్, వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడు | బాలశాస్త్రవేత్తలు | భూపతి, వీఆర్‌ఓ

సేవలకు ప్రశంస

తిరుపతి క్రైం: స్వాంతంత్ర దినోత్సవ సంబరాల్లో భాగంగా విధి నిర్వహణలో ఉత్తమ పని తీరు కనబరచిన పోలీసు సిబ్బందికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేతులమీదుగా ప్రశంసాపత్రాలు, సేవా పతకాలు పంపిణీ చేశారు.



పీసీ రెడ్డి గంగాధర్ | పీఆర్‌ఓ సెక్షన్ రమేష్ | పీసీ రఘురామయ్య | డిప్యూటీ సీఎం నారాయణ స్వామి వద్ద సేవా పతకం అందుకుంటున్న పీసీ గోపాలకృష్ణ



ఏఎస్‌ఐ సుధాకర్ | ఏఎస్‌ఐ ఆనంద్ | ఏఎస్‌ఐ హోలియమ్మ | ఏఆర్ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ | హెచ్‌సీ లవకుమార్ | హెచ్‌సీ రమణయ్య | పీసీ వెంకటేశులు | పీసీ సోమ సుందరం | ఎస్‌బీ ఏఎస్‌ఐ సోమల నాయక్

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

గూడూరురూరల్: హత్యకేసులో నేరారోపణ రుజువు కావడంతో ఓ వ్యక్తికి రూ.2 వేల జరిమానా, జీవిత ఖైదు విధిస్తూ నెల్లూరు ఐదో అదనపు జిల్లా జడ్జి సోమవారం తీర్పు చెప్పారని రెండో పట్టణ సీఐ వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. గూడూరు మండలం అడవికాలనీకి చెందిన తిరుమలశెట్టి జయరామయ్య 2018 నవంబర్ 14వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో చవటపాళెం నుంచి గూడూరు పట్టణంలోకి వస్తుండగా దుగ్గినబోయిన సాయికుమార్ అతని స్నేహితుడు అరవింద్‌తో కసి జయరామయ్యను కల్లు తాగేందుకు డబ్బులు అడిగారు. డబ్బులు ఇవ్వలేదనే కక్షతో సాయికుమార్ వద్ద ఉన్న కత్తితో జయరామయ్యను హత్య చేశాడు. అప్పట్లో మృతుడి కుమారుడు తిరుమలశెట్టి రమేష్ రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి డీఎస్పీ శ్రీరాంబాబు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు దుగ్గినబోయిన సాయికుమార్‌కు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

అనుమానాస్పదంగా కార్మికుడి మృతి

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్ వద్ద ధాన్యం బ్రోకర్ ఆఫీసులో ఓ కార్మికుడు అనుమానాస్పదంగా మంగళవారం మృతి చెందాడు. వివరాలు.. బీహార్‌కు చెందిన కొంతమంది లారీల్లో ధాన్యం లోడింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాతివేళ వారు బ్రోకర్ ఆఫీసులోనే నిద్రిస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నిద్ర లేచి చూసేసరికి ప్రమోద్ సాహన్(28) అనే వ్యక్తి అచేతనంగా పడి ఉన్నాడు. వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా ప్రమోద్ అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. సత్యప్రకాష్ అనే మరో కార్మికుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సారా ఊట ధ్వంసం



ఊట ధ్వంసం చేస్తున్న పోలీసు

రామచంద్రాపురం : మండలంలోని అనుప్పల్లె వద్ద పందిగుంట అటవీ ప్రాంతంలో రెండు డ్రమ్ముల సారా ఊటను పోలీసులు మంగళవారం ధ్వంసం చేశారు. ఎస్ఐ గిరిబాబు మాట్లాడుతూ సారా తయారీపై అందిన సమాచారం మేరకు దాడి చేసి 400 లీటర్ల ఊటను ధ్వంసం చేశామన్నారు. దాడిలో పోలీసు సిబ్బంది సుధాకర్‌రెడ్డి, రాంబాబు, సురేష్ పాల్గొన్నారు.

హోరాహోరీగా అండర్-16 క్రికెట్ టోర్నీ



185 పరుగులు చేసిన కారుణ్యప్రసాద్ | 4 వికెట్లు తీసిన కుళ్లాయప్ప

వెంకటగిరిరూరల్ : పట్టణంలోని తారక రామ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న సౌత్‌జోన్ అండర్-16 క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మంగళవారం అనంతపురం-చిత్తూరు, కడప-నెల్లూరు జట్ల మధ్య పోటీలు జరిగాయి. గ్రౌండ్-1లో చిత్తూరు జట్టు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 104.5 ఓవర్లకు 306 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ప్రసాద్ 70, నిహాల్ 58 పరుగులు చేశారు. అనంతపురం జట్టు బౌలింగ్ విభాగంలో సాయి ప్రతాప్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 2వ ఇన్నింగ్స్‌లో 36 ఓవర్లకు 90 పరుగులు చేసింది. భువనేశ్వర్ 34, భానుప్రసాద్ 38 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. గ్రౌండ్-2లో కడప-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 43 ఓవర్లకు 125 పరుగులు చేసింది. డే-2లో 122.5 ఓవర్లకు 381 పరుగులు చేసింది. కారుణ్య ప్రసాద్ 185, తోషిత్‌యాదవ్ 54 పరుగులు చేశారు. కడప జట్టు బౌలింగ్ విభాగంలో కుళ్లాయప్ప 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప సెకండ్ ఇన్నింగ్స్‌లో 8 ఓవర్లకు 35 పరుగులు చేసింది. మ్యాచ్‌లకు స్కోరర్‌గా సీడీ శ్రీనివాసులురెడ్డి వ్యవహరించారు.

అన్నదాతకు అత్యుత్తమ సేవ



మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్ : ఏపీఎస్పీడీసీఎల్ తరపున అన్నదాతకు అత్యుత్తమంగా సేవలందిస్తున్నామని, అందులో భాగంగా ఏడాదిలో 78వేలకు పైగా వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరు చేసినట్లు సీఎండీ సంతోష్‌రావు తెలిపారు. మంగళవారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవం నిర్వహించారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల ఫలితంగా నేడు మనం స్వేచ్ఛగా జీవనం సాగిస్తున్నామన్నారు. మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యుత్ ఉద్యోగులు విశిష్ట సేవలందించి జాతీయ స్థాయి అవార్డులు అందుకోవడం అభినందనీయమని తెలిపారు. రైతులకు పగటిపూట 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు రోబో టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వీఎన్ బాబు, సుబ్బరాజు, శివప్రసాదరెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, లక్ష్మీనరసయ్య, వరకుమార్, చలపతి, గురవయ్య, అయూబ్ ఖాన్, జాయింట్ సెక్రటరీ రాధాజయశ్రీ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



తులసీరామ్‌కు చికిత్సచేస్తున్న వైద్యసిబ్బంది

తిరుమల : తిరుమల ఆర్‌బీ సెంటర్‌లో మంగళవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. తెలంగాణలోని కరీంనగర్ జిల్లా మల్లియాలకు చెందిన దుంపేటి తులసీరామ్ (41) తిరుమలలో బ్లేడుతో గొంతుకోసుకున్నాడు. వెంటనే స్థానికులు గుర్తించి అశ్విని ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. తిరుమల టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానం పెనుభూతమై..

– భార్యను చంపిన భర్త



భర్త వెంకటేష్‌తో గాయత్రి(ఫైల్)

నారాయణవనం : మండలంలోని బ్రాహ్మణతాంగాళ్ పంచాయతీ వడ్డెర ఇళ్లలో భార్యను ఆమె భర్తే హత్య చేసిన ఘటన కలకలం రేపింది. వివరాలు.. గ్రామానికి చెందిన వెంకటేష్ అలియాస్ పండు కైలాసనాథకోన ఈశ్వరకాలనీకి చెందిన గాయత్రి(32)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి యస్వంతి(12), జగదీష్(4) పిల్లలు. ఇంటి వద్దే గాయత్రి గాజుల దుకాణం నిర్వహించేది. ఇటీవల చంద్రగిరిలోని తన చెల్లెలు రోజా ఇంటికి గాయత్రి వెళ్లి వచ్చింది. తర్వాత క్షేమ సమాచారాలు అడగడానికి రోజా ఫోన్ చేసి అక్కతో మాట్లాడింది. కొత్త నంబర్ నుంచి ఫోన్ వచ్చిందని గాయత్రీపై వెంకటేష్ అనుమానం పెంచుకున్నాడు. సుమారు నెల నుంచి ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో గాయత్రి అనారోగ్యానికి గురైంది. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో నిద్రపోతున్న గాయత్రిని తలపై పెద్ద బండరాయితో కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. వెంటనే వెంకటేష్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఎస్ఐ పరమేష్ నాయక్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, గ్రామస్తులను విచారించారు. గాయత్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేష్‌కుమార్ తెలిపారు.